
సాక్షి సంగారెడ్డి

1

సోమవారం 13-5-2024





క్లుప్తంగా

ఎన్నికల సామగ్రి పంపిణీ



సిబ్బందికి ఎన్నికల సామగ్రిని అందజేస్తున్న అధికారులు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండల పరిధిలోని రుద్రారం శ్రీ చైతన్య జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం ఎన్నికల సిబ్బందికి ఈవీఎంలను అధికారులు పంపిణీ చేశారు. 411 పోలింగ్ కేంద్రాలకు 2 వేల మంది విధులు నిర్వహించనున్నట్లు సహాయక రిటర్నింగ్ అధికారి దేవుజా తెలిపారు. నియోజకవర్గ పరిధిలో 47 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి, మైక్రోఅబ్జర్వర్లను నియమించామన్నారు. ఎప్పటికప్పుడు పోలింగ్ వివరాలు ఆన్‌లైన్ ద్వారా తెలుసుకునేందుకు వెబ్ క్యాస్టింగ్ ఏర్పాటు చేశారు. అదేవిధంగా పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని 411 పోలింగ్ కేంద్రాలను సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని అధికారులు పరిశీలించారు.

ఓటేద్దాం రండి



కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన బోర్డు

సంగారెడ్డి టౌన్: భారత దేశ పౌరుడిగా ఓటు వేయడం మనందరి బాధ్యత. రాజ్యాంగం కల్పించిన హక్కుల్లో ఓటుహక్కు ప్రధానమైనది. ఇందుకు అధికారులు ఓటింగ్ శాతం పెంచేందుకు కృషి చేస్తున్నారు. అందులో భాగంగా కలెక్టరేట్లో పోలింగ్ రోజు సెలవు రోజు కాదు రండి అందరూ ఓటెయ్యండి అంటూ బోర్డులు ఏర్పాటు చేశారు. బోర్డు చూసినవారు ఓటు హక్కు వినియోగం గురించి మాట్లాడుకుంటున్నారు. ఓటుహక్కు వినియోగించుకుందాం మన హక్కుల్ని మనం కాపాడుకుందాం అంటూ ప్రచారం చేస్తున్నారు. సోమవారం పార్లమెంట్ ఎన్నికలు జరగనుండగా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

మునిపల్లి(అందోల్): తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుండటంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆదివారం మండలంలోని ఆయా గ్రామాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం పడుతుండటంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది. ఉరుముల,మెరుపుల శబ్దాలతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు.

ఎల్లమ్మ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: చారిత్రాత్మకమైన నారాయణఖేడ్ మండల పరిధిలోని ర్యాకల ఎల్లమ్మ తల్లి దేవాలయంలో ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాలుగు రోజులుగా ఎల్లమ్మ జాతర జరుగుతోంది. ఆదివారం ఉత్సవాలు ముగింపు కావడంతో ఎమ్మెల్యే అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. ఆయన వెంట సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ రాజేశ్వర్, పండరిరెడ్డి, భూంరెడ్డి తదితరులు ఉన్నారు.

ఓటు కోసం.. ఊరిబాట



గడ్డపోతారం పారిశ్రామిక వాడ

- సొంత రాష్ట్రాలకు ప్రజలు పయనం
- పారిశ్రామిక వాడలు ఖాళీ
- ఉత్పత్తులపై ప్రభావం
- చర్యలు చేపట్టిన యాజమాన్యాలు

ఓటు వేసేందుకు ఇతర రాష్ట్రాలకు చెందిన ప్రజలు వారి సొంత ఊళ్లకు తరలివెళ్లారు. మూడు రోజుల నుంచి ఆయా పారిశ్రామికవాడల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు, కార్మికులు తమ స్వగ్రామాల బాట పట్టారు. దీంతో పారిశ్రామిక వాడలు ఖాళీ అయ్యాయి. రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. పరిశ్రమల్లో విధులు నిర్వహించే వారు సొంత ఊళ్లకు వెళ్లడంతో ఉత్పత్తులపై ప్రభావం చూపుతుందని యాజమాన్యాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అందుకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాయి.

జిన్నారం(పటాన్‌చెరు): జిల్లా వ్యాప్తంగా జిన్నారం, హత్నూర, బొల్లారం, గడ్డపోతారం, బొంతపల్లి, పటాన్‌చెరు, పాశమైలారం తదితర పారిశ్రామిక వాడల్లో లక్షల సంఖ్యలో కార్మికులు, ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. దేశంలో అన్ని రాష్ట్రాలకు చెందిన కార్మికులు పరిశ్రమల్లో విధులు పనిచేస్తున్నారు. ప్రస్తుతం తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, బీహార్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిషా, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగుతుండటంతో ఆయా రాష్ట్రాలకు చెందిన కార్మికులు ఓటు వేసేందుకు సొంత ఊళ్లకు పయనమయ్యారు. ఓటింగ్ రోజు వేతనంతో కూడిన సెలవు ఇవ్వనుండగా, సొంత రాష్ట్రాలకు వెళ్లాల్సి ఉండటంతో మూడు రోజుల ముందు నుంచే వెళ్లేందుకు కార్యాచరణ సిద్ధం చేసుకున్నారు. ఓటుహక్కు వినియోగించుకున్న తర్వాత తిరిగి వచ్చేందుకు మరో మూడు రోజుల సమయం తీసుకుంటుంది. మొత్తంగా వారు తిరిగి వచ్చేందుకు వారం పడుతుంది. కార్మికుల కొరతతో పరిశ్రమల్లో ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం చూపనుంది. ప్రస్తుతం పారిశ్రామిక వాడలు ఖాళీగా కనిపిస్తున్నాయి. కార్మికుల సందడి లేదు. ట్రాఫిక్ సమస్య కూడా లేదు. ఏదిఏమైనా ఓటర్లు వారి ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేందుకు బాధ్యతగా సొంత గ్రామాలకు వెళ్లటం అభినందనీయమని పలువురు ప్రశంసిస్తున్నారు.



నిర్మానుష్యంగా పారిశ్రామిక వాడ రోడ్డు

యాజమాన్యాల ప్రత్యామ్నాయ చర్యలు

ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులు, ఉద్యోగులు ఓటువేసేందుకు వారి సొంత గ్రామాలకు వెళ్తుండటంతో పరిశ్రమల యాజమాన్యాలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాయి. రసాయన పరిశ్రమల్లో రియాక్టర్‌ల సంఖ్యను తగ్గించేలా చర్యలు చేపడుతున్నారు. వేసవి కావటంతో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. ఓటింగ్ రోజు కార్మికులకు ఎట్టి పరిస్థితిలో వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని ఎన్నికల కమిషన్ అధికారులు ఆదేశించడంతో ఆ దిశగా యాజమాన్యాలు ముందస్తు చర్యలు చేపట్టాయి.

ఓటర్ స్లిప్‌లోనే సమాచారం

- క్యూఆర్ కోడ్ స్కాన్‌చేస్తే క్షణంలో వివరాలు
- పోలింగ్ కేంద్రం, రూట్ తెలుసుకోవచ్చు
- ఓటర్లకు చేరిన ఓటర్ స్లిప్‌లు



జోగిపేటలో అధికారులు పంపిణీ చేసిన ఓటరు స్లిప్

జోగిపేట(అందోల్): ఎన్నికల సమయంలో ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకు ఇబ్బందులు పడకుండా ఎన్నికల కమిషన్ అన్ని చర్యలు తీసుకుంది. పాలకులను ఎన్నుకునేందుకు ఓటు చాలా కీలకం కావడంతో చిన్నచిన్న సాంకేతిక సమస్యలతో ఓటుహక్కు వినియోగించుకోకుండా వెనక్కి వెళ్లకుండా పకడ్బందీ చర్యలు చేపట్టింది. తమ ఓటు ఏ పోలింగ్ బూత్‌లో ఉందన్న విషయాన్ని స్పష్టంగా తెలిసేలా ఓటు స్లిప్‌పైనే క్యూఆర్ కోడ్ ముద్రించారు. దీంతో ఓటరు చాలా సులువుగా తాను ఓటు వినియోగించుకునే కేంద్రానికి వెళ్లగలుగుతున్నాడు. ఓటరు జాబితాలో తమ పేరు కనబడకున్నా, పోలింగ్ కేంద్రం విషయంలో స్పష్టత లేకున్నా ఓటర్లు ఓటేసేందుకు ఆసక్తి చూపించకుండా వెనక్కి వెళతాడు. దీంతో పోలింగ్ శాతం తగ్గే అవకాశం కూడా ఉంటుంది. అందుకే అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నారు. పల్లెలతో పోలిస్తే పట్టణాల్లో ఓటింగ్ మరీ తక్కువగా నమోదవుతోంది. ఈ పరిస్థితిని మార్చేందుకు, మరింత మందిని పోలింగ్ కేంద్రాలకు రప్పించేందుకు ఎన్నికల సంఘం గట్టి కసరత్తు చేసింది. ఓటరు స్లిప్‌లపై క్యూఆర్ కోడ్‌లు ముద్రించింది. పోలింగ్ బూత్ ఎక్కడ ఉన్నది మొదలుకుని ఓటింగ్‌కు సంబంధించిన సమస్త సమాచారాన్ని కోడ్ సాయంతో ఇట్టే తెలుసుకోవచ్చు.

స్కాన్ చేస్తే పూర్తి సమాచారం

ఓటర్ స్లిప్‌లపై ఉండే క్యూఆర్ కోడ్‌ను మొబైల్‌తో స్కాన్‌చేస్తే చాలు ఓటు ఏ పోలింగ్ బూత్‌లో ఉందో చెబుతుంది. అక్కడికి ఎలా వెళ్లాలో కూడా గూగుల్ మ్యాప్ సాయంతో చూపిస్తుంది. క్యూఆర్‌తో కూడిన ఓటర్ స్లిప్‌ల కారణంగా పొరుగు రాష్ట్రాల్లో పోలింగ్ శాతం బాగా పెరిగినట్లుగా కూడా పత్రికల్లో చూసాం. చాలామంది ఓటర్లకు పోలింగ్ బూత్ ఎక్కడ ఉందో తెలియడం లేదు. ముఖ్యంగా పట్టణాల్లో ఈ పరిస్థితి ఉంటుంది. ప్రభుత్వ భవనాలెక్కడున్నదీ తెలియకపోవడం ఇందుకు ప్రధాన కారణం. క్యూఆర్ కోడ్ దీనికి పరిష్కారం.

తక్కువ ఓట్ల నమోదు ప్రాంతాలపై దృష్టి

చాలా తక్కువ ఓటింగ్ నమోదవుతున్న ప్రాంతాలపై ఈసీ ప్రత్యేక దృష్టి పెట్టింది. ఆయా ప్రాంతాలకు బృందాలను పంపి ఓటర్లలో చైతన్యానికి చర్యలు తీసుకుంటోంది. ఈ విషయంలో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల సాయం కూడా తీసుకుంటోంది. బూత్ వద్ద పొడవాటి క్యూలు చూసి అంతసేపు లైన్లో ఉండాలా అని చాలామంది అనుకుంటారు. దీనికి విరుగుడుగా పోలింగ్ బూత్ వద్ద క్యూను ఇంటి నుంచే మొబైల్‌లో తెలుసుకునేలా యాప్‌లను ఈసీ అభివృద్ధి చేసింది.

పార్టీలో చేరిన వారికి ప్రత్యేక గుర్తింపు



పార్టీలో చేరిన శ్రీకాంత్‌గౌడ్

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్

జిన్నారం(పటాన్‌చెరు): ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండలంలోని సోలక్‌పల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నేత శ్రీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం పలువురు యువకులు, నాయకులు కాటా శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరేందుకు ముందుకు వస్తున్నారన్నారు. పార్టీలో చేరిన వారికి తగిన ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధిక స్థానాల్లో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రవీందర్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు వడ్డె కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న నర్సింహారెడ్డి

పటాన్‌చెరు: పటాన్‌చెరు, రామచంద్రాపురంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఓటర్లను మభ్యపెడుతూ డబ్బులు పంపిణీ చేస్తున్నారని సహాయ సహాయక ఎన్నికల రిటర్నింగ్ అధికారికి దేవుజాకు ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి ఆదివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబ్బుల పంపిణీ పై ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశానన్నారు. డబ్బు, మద్యం పంపిణీ జరగకుండా ఎన్నికల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మాణిక్యం, ఏట్టయ్య, రవి పాల్గొన్నారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం



జహీరాబాద్‌లో పోలింగ్ సామగ్రితో కేంద్రాలకు బయలుదేరిన సిబ్బంది

వాహనాల్లో తరలివెళ్లిన సిబ్బంది

జహీరాబాద్: సోమవారం జరగనున్న పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ కోసం జహీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆర్డీఓ రాజు ఆధ్వర్యంలో ఎన్నికల సిబ్బందిని ఆయా కేంద్రాలకు కేటాయించారు. నియోజకవర్గంలోని జహీరాబాద్, కోహీర్, ఝరాసంగం, న్యాల్‌కల్, మొగుడంపల్లి మండలాల్లో 313 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలకు 389 మంది పోలింగ్ అధికారులు, 389 మంది అసిస్టెంట్ పోలింగ్ అధికారులు, 762 మంది ఓపీఓలను నియమించారు. సిబ్బందికి ఈవీఎం తదితర సామగ్రిని అందజేశారు. 35 రూట్లుగా ఏర్పాటు చేసి సిబ్బందిని వాహనాల్లో తరలించారు.

వర్షం రాకతో ఇబ్బంది

పోలింగ్ కేంద్రాలకు సామగ్రితో తరలివెళ్లేందుకు సిబ్బంది సిద్ధమైన సమయంలో భారీ వర్షం పడింది. దీంతో కొంత అంతరాయం కలిగింది. సగం మంది అప్పటికే వాహనాల్లోకి చేరారు. మిగతా వారు సామగ్రి పంపిణీ కేంద్రంలోనే ఉండి పోయారు. టెంట్ల నుంచి వర్షపు నీరు కారడంతో సిబ్బంది ఇబ్బంది పడ్డారు.

ఎన్నికలు సజావుగా సాగేందుకు బందోబస్తు

జహీరాబాద్ అసెంబ్లీ నియోజకరవర్గం పరిధిలో ఎన్నికలు సజావుగా జరిగేందుకు జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇద్దరు డీఎస్పీలు, పది మంది సీఐలు, 25 మంది ఎస్‌ఐలు, 700 మంది పోలీసు సిబ్బందిని నియమించారు. 21 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో అదనపు బలగాలను నియమించారు.

జిన్నారం(పటాన్‌చెరు): ఎంపీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు జిన్నారం, గుమ్మడిదల మండలాల్లో శనివారం అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. జిన్నారం మండలంలో 59,327 మంది ఓటర్లు ఉండగా వీరిలో మహిళలు 27645, పురుషులు 31669, ఇతరులు 13 మంది ఉన్నారు. 61 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. బొల్లారం మున్సిపాలిటీలోని మూడు పోలింగ్ కేంద్రాలను అత్యంత సమస్యాత్మక కేంద్రాలుగా అధికారులు గుర్తించారు. గుమ్మడిదల మండలంలో 32391 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో మహిళలు 16327, పురుషులు 16058, ఇతరులు ఆరుగురు ఉన్నారు. 35 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మండలంలోని బొంతపల్లి, కానుకుంట గ్రామాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు. బొల్లారం, జిన్నారం గ్రామాల్లోని పలు పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ భిక్షపతి పరిశీలించారు. ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు.

62 పోలింగ్ కేంద్రాలు..

న్యాల్‌కల్(జహీరాబాద్): సోమవారం జరగనున్న లోక్‌సభ ఎన్నికలకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆదివారం రాత్రి వరకు పోలింగ్ ఏర్పాట్లను మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి పరిశీలించారు. మండలంలో 62 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 250 మంది సిబ్బందిని నియమించారు. మొత్తం 48,163 మంది ఓటర్లు ఉన్నారు. 24,212 మంది పురుషులు, 23,950 మహిళలు, ఒకరు ట్రాన్ జెండర్ ఉన్నారు.

59 పోలింగ్ కేంద్రాలు

హత్నూర(సంగారెడ్డి): పార్లమెంట్ ఎన్నికలకు హత్నూర మండలంలో 59 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశారు. కేంద్రాల వద్ద వంద మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ సుభాష్ ఆదివారం తెలిపారు. డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐ ఆధ్వర్యంలో ఇద్దరు ఏఎస్‌ఐలు, 70 మంది తమిళనాడు రాష్ట్రానికి చెందిన హోంగార్డులు, ఏడుగురు కానిస్టేబుళ్లు, 30 మంది స్థానిక పోలీసులతో పాటు రూట్ పెట్రోలింగ్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హత్నూర, గుండ్లమాచునూర్, చింతల్చెరు, బోరపట్ల, కాసాల, దౌల్తా బాద్ సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించారు.



జిన్నారంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ భిక్షపతి

298 పోలింగ్ కేంద్రాలు

నారాయణఖేడ్: లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు సిబ్బంది నారాయణఖేడ్ నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాలకు ఆదివారం సాయంత్రం చేరుకున్నారు. ఖేడ్ ప్రభుత్వ ఆదర్శ డిగ్రీకళాశాల ఆవరణలో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో 298 పోలింగ్ కేంద్రాలు ఉండగా 35 రూట్లుగా విభజించి రూట్ల వారీగా సిబ్బందిని పోలీసు బందోబస్తుతో వాహనాల్లో పంపించారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు గోపాల్‌జీ తివారీ, జిల్లా అదనపు కలెక్టరు మాధురి ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని పరిశీలించి ఆర్డీఓ అశోక చక్రవర్తి, డీఎస్పీ వెంకట్‌రెడ్డిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

మూర్ఛతో పడిపోయిన ఉపాధ్యాయుడు

ఖేడ్ నియోజకవర్గంలో ఎన్నికల విధుల్లో పాల్గొనేందుకు వచ్చిన ఉపాధ్యాయుడు మూర్ఛవ్యాధితో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంలో పడిపోయాడు. జిల్లాలోని మొగుడంపల్లి మండలం రాయిపల్లి తండాకు చెందిన ఉపాధ్యాయుడు తోగు జాదవ్(46) ఎన్నికల విధుల నిర్వహణలో భాగంగా ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రానికి వచ్చాడు. మూర్ఛతో ఒక్కసారిగా కింద పడిపోవడంతో అక్కడే ఉన్న వైద్య సిబ్బంది అతడిని పరిక్షించి మూర్ఛతో పడిపోయినట్లు నిర్ధారించారు. కొద్దిసేపటికి కోలుకోవడంతో వైద్యాధికారి డాక్టర్ రాజేశ్వర్ మెరుగైన వైద్యం కోసం ఆయనను 108లో స్థానిక ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో మళ్లీ మూర్ఛ రావడంతో సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు డాక్టర్ రాజేశ్వర్ తెలిపారు.

పటాన్‌చెరు టౌన్: లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాటు చేశారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో మొత్తం 410179 ఓటర్లు ఉన్నారు. వీరిలో 211055 పురుషులు, 199038 మంది మహిళలు, 86 మంది ఇతరులు ఉన్నారు. 47 సమస్యాత్మక ప్రాంతాల్లో మైక్రో అబ్జర్వర్లను నియమించారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో 411 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో ఐదు మహిళా పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. సమస్యాతక ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఎస్పీ రవీందర్ రెడ్డి తెలిపారు.



నారాయణఖేడ్‌లో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ మాధురి

సంక్షిప్త వార్తలు

◆ **గ్రామాలకు చేరుకున్న ఓటర్లు**

మునిపల్లి(అందోల్): ఉపాధి, వ్యాపారాల కోసం వలస వెళ్లిన వారంతా ఎంపీ ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకోవడానికి స్వగ్రామాలకు వచ్చారు. ఆదివారం మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ఓటర్లు హైదరాబాద్, ముంబై, జహీరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాలకు బతుకుదెరువు కోసం వలస వెళ్లిన వారంతా కుటుంబ సభ్యులతో కలిసి సొంత ఊళ్లకు చేరుకున్నారు. ఇరుగు పొరుగు వారితో మాట్లాడుతూ గ్రామంలో పరిస్థితి ఎలా ఉందనే వివరాలు తెలుసుకుంటున్నారు

◆ **16న వాహనాల వేలం**

నారాయణఖేడ్: ఎక్సైజ్ కేసుల్లో సీజ్ చేసిన మారుతి స్విఫ్ట్ డిజైర్ కారు, బజాజ్ మోటారు సైకిల్‌ను ఈనెల 16వ తేదీ ఉదయం 11 గంటలకు ఖేడ్ ఎక్సైజ్ కార్యాలయం ఆవరణలో వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ రఘునాథ్ రెడ్డి తెలిపారు. వేలం పాటల్లో పాల్గొనడానికి ఆసక్తి గలవారు పూర్తివివరాల కోసం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

◆ **యువతి ఆత్మహత్య**

పటాన్‌చెరు టౌన్: కడుపు నొప్పి భరించలేక యువతి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన ఆదివారం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం పటాన్‌చెరు మండలం ముత్తంగి న్యూటన్ కాలనీకి చెందిన ప్రమీల(17) రెండు సంవత్సరాలుగా కడుపు నొప్పితో బాధపడుతోంది. వైద్యం చేయించినా ఫలితం లేకుండా పోయింది. ఈ క్రమంలో 11వ తేదీన సోదరులు ప్రేమ్, ప్రవీణ్ పనికి వెళ్లిన తర్వాత ఇంటిలోకి వెళ్లి ఆత్మహత్య చేసుకుంది. సాయంత్రం ఇంటికి వచ్చిన సోదరులకి ప్రమీల ఆత్మహత్య చేసుకుని కనిపించింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి సోదరుడు ప్రేమ్ తన సోదరి కడుపునొప్పి భరించలేక ఆత్మహత్య చేసుకుందని ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

◆ **ఖేడ్‌లో భారీవర్షం**

నారాయణఖేడ్: నారాయణఖేడ్‌లో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతోకూడిన భారీవర్షం కురిసింది. దాదాపు గంటసేపు కురిసిన వర్షానికి పట్టణంలోని రహదారులు జలమయమయ్యాయి. ఖేడ్ మండలం తుర్కపల్లితండాలో పండిత్ నాయక్‌కు చెందిన ఇల్లు పాక్షికంగా కూలింది. కూలిన గదిలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. డివిజన్ పరిధిలోని పలు గ్రామాల్లో పది ఇళ్లు పాక్షికంగా కూలినట్లు తెలిసింది. అధికారులు ఎన్నికల విధుల్లో ఉండటంతో పూర్తివివరాలు తెలియరాలేదు. పలు ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబోసిన ధాన్యం తడిచిపోయింది.

◆ **ఎన్నికల నియమావళిని పాటించాలి**

రాయికోడ్(అందోల్): ప్రజలు ఎన్నికల నియమావళిని పాటించాలని సీఐ పరమేశ్వర్ అన్నారు. రాయికోడ్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. మండలంలో 42 పోలింగ్ బూత్‌లు ఉన్నాయని డీఎస్పీ, సీఐ, నలుగురు ఎస్‌ఐలు, నలుగురు ఏఎస్‌ఐలతో పాటు 50 మంది సిబ్బంది పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహిస్తున్నారన్నారు.

◆ **గుంతలోపడి వ్యక్తి మృతి**

పటాన్‌చెరు టౌన్: ఎండ్రకాయలు పట్టేందుకు వెళ్లి గుంతలో పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. హెడ్‌కానిస్టేబుల్ నరేష్ ముదిరాజ్ కథనం ప్రకారం పటాన్‌చెరు మండలం రామేశ్వరంబండ గ్రామం వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన డప్పు నర్సింలు(35) కూలి పనులు చేస్తుంటాడు. ఈ క్రమంలో 10వ తేదీన తన స్నేహితులు నాగులు, బాలకృష్ణతో కలిసి పనికి వెళ్లాడు. మల్లన్న గుట్ట సమీపంలోని గుంతల్లో ఎండ్రకాయలు పట్టే క్రమంలో ప్రమాదవశాత్తు గుంతలో పడి మునిగిపోయాడు. దీంతో వెంటఉన్న స్నేహితులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి గుంతలో గాలింపు చేపట్టగా ఆచూకీ లభించలేదు. 11వ తేదీన మృతదేహం తేలడంతో సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి సోదరుడు జగన్ ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

◆ **జాతరలో కుస్తీపోటీలు**

నారాయణఖేడ్: నారాయణఖేడ్ మండలంలోని ర్యాకల ఎల్లమ్మ తల్లి ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం కుస్తీపోటీలు నిర్వహించారు. పోటీల్లో స్థానిక మల్లయోధులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మల్లయోధులు పాల్గొన్నారు. గెలుపొందిన విజేతకు నిర్వాహకులు రూ.5 వేల నగదు బహుమతిని అందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు గుండ్రెడ్డి, రమేష్ చౌహాన్, సాయాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **బీఆర్‌ఎస్ జెండా ఎగురవేస్తాం**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ మెదక్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని రాష్ట్ర శాసన మండలి మాజీ ప్రోటెం చైర్మన్ వెన్నవరం భూపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం రామచంద్రాపురం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో ఎంతో అభివృద్ధి చెంది దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. కేసీఆర్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు.

◆ **విద్యుత్‌నగర్‌లో స్వల్ప ఉద్రిక్తత**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధి విద్యుత్‌నగర్ కాలనీలో ఆదివారం సాయంత్రం బీఆర్‌ఎస్ నాయకులు డబ్బులు పంచుతున్నారంటూ కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు నినాదాలు చేయడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. తెల్లాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ లలిత భర్త మల్లేపల్లి సోమిరెడ్డి విద్యుత్‌నగర్‌లోని తన కార్యాలయంలో కౌన్సిలర్లు లచ్చిరాం నాయక్, బాలాజీలతో కలసి ఉన్నారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు అక్కడి చేరుకిన డబ్బులు పంచుతున్నారని నినాదాలు చేశారు. ఈ విషయం తెలుసుకున్న కొల్లూర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఇరువర్గాలను వెళ్లగొట్టారు.

◆ **తప్పుడు ప్రచారం నమ్మకండి**

నారాయణఖేడ్: ప్రతిపక్ష పార్టీలు పాత వీడియోలను సామజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తూ ఎన్నికల్లో లబ్ధి పొందాలని ప్రయత్నిస్తున్నాయని ఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. జహీరాబాదు పార్లమెంట్ అభ్యర్థి సురేష్ షెట్కార్‌కు తనకు మధ్య విభేధాలు ఉన్నట్లు పాత వీడియోలను ప్రతిపక్ష పార్టీల నాయకులు సామజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తున్నారన్నారు. షెట్కార్, తాను ఒక్కటేనని, ఐకమత్యంగానే ఉన్నామన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు.

సాక్షి సంగారెడ్డి

3

సోమవారం ၊ 13 ၊ మే ၊ 2024

హరీశ్‌రావు కనుసన్నల్లోనే డబ్బుల పంపిణీ

బీజేపీ అభ్యర్థి రఘునందన్ ఆరోపణ



మాట్లాడుతున్న రఘునందన్‌రావు

మెదక్‌జోన్: మాజీ మంత్రి హరీశ్‌రావు కనుసన్నల్లోనే డబ్బులు పంచుతున్నారని బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు ఆరోపించారు. చేగుంట సమీపంలో దొరికిన రూ.88 లక్షలు బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డివేనని అన్నారు. ఈ మేరకు ఆదివారం ఎన్నికల అధికారి రాహుల్‌రాజ్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చేగుంట మండలం పెద్దశివునూర్ ఫాంహౌస్‌లోకి బీఆర్ ఎస్ నేతలు 15 కార్లలో వచ్చి దుబ్బాక నియోజకవర్గంలో బూత్‌లవారీగా డబ్బులు పంపిణీకి సిద్ధం అయ్యారన్నారు. ఈ విషయంపై పోలీస్ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినా సకాలంలో రాలేకపోయారని, అయినా రూ.88 లక్షలు దొరికాయని తెలిపారు. ముందుగా వచ్చి ఉంటే పెద్ద మొత్తంలో డబ్బులు దొరికేవన్నారు. దొరికిన డబ్బును వెంకట్రామిరెడ్డి అకౌంట్లో జమకట్టాలని కోరారు. ఇంత జరుగుతున్నా పోలీస్ యంత్రాంగం చూసీ చూడనట్టు వ్యవహరిస్తుందని ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి దొంగాపోలీస్ ఆడుతున్నారన్నారు. బీఆర్ఎస్ నాయకులు ఎన్నికుట్రలు చేసినా తన గెలుపును ఆపలేర న్నారు. గడ్డం శ్రీనివాస్, ఎంఎల్ఎస్ రెడ్డి, నాయిని ప్రసాద్ తదితరులు ఉన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

ఎస్పీ రూపేష్



సూచనలు చేస్తున్న ఎస్పీ రూపేష్

పటాన్‌చెరు టౌన్: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అధికారులు విధులు నిర్వర్తించాలని ఎస్పీ రూపేష్ ఆదేశించారు. ఆదివారం పటాన్‌చెరు మండలం రుద్రారం ఎన్నికల సామగ్రి పంపిణీ సెంటర్ వద్ద రూట్ మొబైల్ అధికారులు, సిబ్బంది, ఇతర అధికారులకు ఆయన దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు, ఎన్నికల సామగ్రి రక్షణ బాధ్యత రూట్ మొబైల్ అధికారులదే అన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహించొద్దన్నారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు ఎన్నికల కోడ్‌ను తప్పకుండా పాటించాలన్నారు. సమావేశంలో పటాన్ చెరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, సీఐ ప్రవీణ్ రెడ్డి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ మల్లేష్ పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం

- ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంలో కుప్పకూలిన టెంట్లు
- కళాశాలలోకి పరుగులు పెట్టిన ఉద్యోగులు



ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ పాయింట్‌లో నేలకొరిగిన టెంట్లు

నారాయణఖేడ్: పట్టణంలో గాలివాన బీభత్సం సృష్టించింది. ఆదివారం మధ్యాహ్నం 3గంటల నుంచి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఎన్నికల సామగ్రి పంపిణీ కోసం మోడల్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన టెంట్లు గాలివానకు కుప్పకూలాయి. దీంతో ఉద్యోగులు కళాశాల భవనంలోకి పరుగులు పెట్టారు. నియోజకవర్గంలోని 298 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి 35 రూట్లలోని పోలింగ్ సిబ్బందిని తరలించేందుకు కేంద్రం ఏర్పాటు చేశారు. కొందరు సిబ్బందిని అప్పటికే అధికారులు పోలింగ్ కేంద్రాలకు తరలించారు. మరికొందరు అక్కడే ఉన్న సమయంలో భారీ వర్షం మొదలైంది. గాలికి టెంట్లు కూలడంతోపాటు కళాశాల ప్రాంగణం జలమయమైంది. ఇదే వాన అరగంట ముందు కురిసి ఉంటే ఎన్నికల సామగ్రికి నష్టం వాటిల్లేదని అధికారులు పేర్కొన్నారు. వర్షం వల్ల నారాయణఖేడ్ రోడ్లపై వరదనీరు పారింది.



పర్యవేక్షణ

లోక్‌సభ ఎన్నికల పోలింగ్ సోమవారం జరగనున్న నేపథ్యంలో కలెక్టరేట్‌లో వెబ్ కాస్టింగ్ కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. ఇక్కడి నుంచి జిల్లాలో జరుగుతున్న పోలింగ్ సరళిని అధికారులు పర్యవేక్షించనున్నారు.

– సంగారెడ్డి టౌన్

నేడే పోలింగ్

సార్వత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధం

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఓటింగ్
- జహీరాబాద్ బరిలో 19మంది అభ్యర్థులు
- 16.40 లక్షల మంది ఓటర్లు.. 1,973 పోలింగ్ కేంద్రాలు
- పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లిన అధికారులు, సిబ్బంది

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ సోమవారం జరగనుంది. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. ఇందుకోసం జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాటు చేసింది. ఎండలను దృష్టిలో ఉంచుకుని పోలింగ్ సమయాన్ని ఒక గంట పాటు సాయంత్రం ఆరు గంటల వరకు పొడగిస్తూ ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకున్న విషయం విదితమే. ఈ సార్వత్రిక ఎన్నికల్లో జహీరాబాద్ లోక్‌సభ స్థానం పరిధిలో మొత్తం 16.40 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందులో 8.01 లక్షల మంది పురుషులు కాగా, 8.39 లక్షల మంది మహిళలు ఉన్నారు. ఈ నియోజకవర్గం పరిధిలో జిల్లాలోని జహీరాబాద్, అందోల్, నారాయణఖేడ్,



పోలింగ్ కేంద్రాలకు తరలుతున్న సిబ్బంది

కామారెడ్డి జిల్లాలోని జుక్కల్, బాన్సువాడ, ఎల్లారెడ్డి, కామారెడ్డి అసెంబ్లీ సెగ్మెంట్లు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 1,973 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 243 పట్టణ ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలుండగా, 1,730 కేంద్రాలు పల్లెల్లో ఉన్నాయి. సగటున 830 మందికి ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో మొత్తం 19 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఓటర్లు తమ విలువైన ఓటు హక్కును వినియోగించుకుని ఈ అభ్యర్థుల భవిత్యాన్ని తేల్చనున్నారు.



సంగారెడ్డి ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో పోలింగ్ సామగ్రిని తీసుకుంటున్న సిబ్బంది

పోలింగ్ కేంద్రాలకు తరలిన సిబ్బంది

పోలింగ్ విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది ఆదివారమే పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లారు. పోలింగ్ సామగ్రితో పాటు, ఈవీఎంలు, వీవీప్యాట్‌లు ఇతర పోలింగ్ ఎక్విప్‌మెంట్ తీసుకుని కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. అన్ని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మా కేంద్రాల నుంచి బస్సుల్లో పోలింగ్ బూత్‌లకు తరలివెళ్లారు. ఎన్నికల ప్రిసై డింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర పోలింగ్ సిబ్బంది పోలింగ్ బూత్‌లకు చేరుకున్నారు.



పోలింగ్ సామగ్రితో వెళ్తూ..

డిస్ట్రిబ్యూషన్ కేంద్రం పరిశీలన



సామగ్రి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

జహీరాబాద్: జహీరాబాద్‌లోని బాగారెడ్డి స్టేడియం గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని కలెక్టర్ వల్లూరి క్రాంతి ఆదివారం సందర్శించారు. ఈవీఎంలు, సామగ్రి పంపిణీ జరుగుతున్న తీరుపై ఆర్డీఓ రాజును అడిగి తెలుసుకున్నారు.

పోలింగ్ విధుల్లో 9,376 మంది

ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర సిబ్బంది అంతా కలిపి జహీరాబాద్ పరిధిలో మొత్తం 9,376 మంది ఉద్యోగులు, సిబ్బంది పోలింగ్ ప్రక్రియలో పాల్గొననున్నారు. వీరితో పాటు రిజర్వులో మరి కొంత మంది ఉద్యోగులను అందుబాటులో ఉంచారు. పోలింగ్ నిర్వహణ ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి క్రాంతి పర్యవేక్షించారు. శనివారం అన్ని పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భారీ బందోబస్తు

పోలింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీసుశాఖ భద్రతాపరమైన అన్ని ఏర్పాట్లు చేసింది. సంగారెడ్డి జిల్లా పరిధిలో సుమారు 2,400 మంది పోలీసులను ఎన్నికల బందోబస్తు కోసం నియమించారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను ముందుగానే గుర్తించిన పోలీసుశాఖ.. ఈ కేంద్రాల్లో పోలింగ్ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించింది. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసింది. ఎన్నికల ప్రచారం కోసం ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన స్థానికేతరులు వెళ్లిపోవాలని పోలీసుశాఖ ఆదేశాలు జారీ చేసింది. లాడ్జీలు, గెస్ట్‌హౌస్‌లు, హోటళ్లలో స్థానికేతరులు ఉండకుండా చర్యలు తీసుకున్నారు. ఓటర్లను ప్రలోభ పెడుతున్నట్లు తెలిస్తే 1950, సి–విజిల్‌కు ఫిర్యాదు చేయాలని ఎస్పీ రూపేష్ పేర్కొన్నారు.

క్లుప్తంగా

బియ్యపు గింజలతో 'ఈవీఎం'



బియ్యపు గింజలతో ఈవీఎం రూపం.. చిత్రించిన రామకోటి రామరాజు

గజ్వేల్‌రూరల్: లోక్‌సభ ఎన్నికలు సోమవారం జరగనున్న నేపథ్యంలో ఈవీఎం రూపాన్ని బియ్యపు గింజలతో రూపొందించారు.. రామకోటి భక్తసమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్రస్థాయి కళారత్న అవార్డు గ్రహీత రామకోటి రామరాజు. ఓటే వజ్రాయుధం, నిజాయితీగా వేద్దామని అక్షరాలను సైతం రాశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైందన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కును అర్హులైన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు.

తల్లి ప్రేమ అమూల్యమైనది

ఎల్‌ఎఫ్ ఆరోగ్య యోగా సెంటర్ చైర్మన్ భారతీ

మొయినాబాద్‌రూరల్: లోకంలో అత్యంత అమూల్యమైనది తల్లి ప్రేమ అని ఎల్‌ఎఫ్ ఆరోగ్య యోగా సెంటర్ చైర్మన్ భారతీ అన్నారు. ఆదివారం మాతృదినోత్సవం సందర్భంగా అజీజ్‌నగర్‌లో గల యోగా సెంటర్‌లో మాతృ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కన్నబిడ్డల భవిష్యత్ కోసం నిత్యం శ్రమిస్తూ వారి కళ్లల్లో ఆనందాన్ని చూసేదే తల్లి అన్నారు. అనంతరం యోగా కేంద్రంలో కేక్‌కట్ చేసి అందరికి పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎల్‌ఎఫ్ సెంటర్ డైరెక్టర్ శ్రీనివాస్, సభ్యులు సుధాకర్, లక్ష్మిప్రసన్న, శ్రవంతి, భవ్య, వరలక్ష్మి, వీరాచారి, అమ్డాపూర్ నాగేశ్, మాణిక్యం, బంగాలిగూడ అశోక్, వివిధ గ్రామాల మహిళలు, యువకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు షురూ

శంషాబాద్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (రాజేంద్రనగర్)లో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ బయాలాజికల్ సైన్స్, ఫిజికల్ సైన్స్ కోర్సులు ఉన్నాయని పేర్కొన్నారు. ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు దోస్త్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకుని రాజేంద్రనగర్ కళాశాలకు మొదటి ఆప్షన్ ఇవ్వాలని సూచించారు. మరిన్ని వివరాలకు 94419 56233,70327 13785 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సేవాలాల్ మహరాజ్ గొప్ప మార్గదర్శకుడు

కొత్తూరు: గిరిజనుల ఆరాధ్యదైవం సంత్‌శ్రీ సేవాలాల్ మహరాజ్ సమాజానికి గొప్ప మార్గదర్శకుడని ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని మల్లాపూర్ గుడితండాలో ఆదివారం నిర్వహించిన సేవాలాల్ ఆలయ వార్షికోత్సవం, దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొని ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో భాగంగా స్థానిక గిరిజన నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు ఎంపీపీతో పాటు నాయకులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు రాందాస్‌నాయక్, రవి నాయక్, దయానంద్‌గుప్తా, దశరథ్‌నాయక్, నర్సింహారెడ్డి, మోదీ దర్శన్, మల్లేశ్, జయేందర్‌రెడ్డి, శ్రీరాములు, రాజుగౌడ్ పాల్గొన్నారు.

కసిరెడ్డి నారాయణరెడ్డికి పరామర్శ

తలకొండపల్లి: మండల పరిధిలోని ఖానాపూర్ గ్రామానికి శనివారం రాత్రి విచ్చేసిన భట్టి విక్రమార్క ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ్‌రెడ్డి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఎమ్మెల్యే కసిరెడ్డితో ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ యాదయ్య ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవి, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీతారామాంజనేయ దేవాలయంలో పూజ

తలకొండపల్లి: మండల పరిధిలోని చీపునుంతల గ్రామంలోని సీతారామాంజనేయ స్వామి దేవలయంలో, గణపతి, సుబ్రహ్మణ్య శివ, నంది, సీతారామ లక్ష్మణ, ఆంజనేయ స్వామి విగ్రహాలు, గజస్తంభం, శిఖరాలు ప్రతిష్ఠించి 41 రోజులు పూర్తయిన సందర్భంగా ఆదివారం ఆలయంలో మండల పూజ నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణాల మధ్య హోమం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, వైస్ చైర్మన్ వెంకటయ్య, కార్యదర్శి బత్తుల బాల కుమార్ గౌడ్, నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిఘా నీడన గ్రామాలు

- ఎన్నికల నిర్వహణపై ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ
- కారు పైభాగాన సీసీ కెమెరా, వీడియో ఏర్పాటు
- కలెక్టరేట్‌కు అనుసంధానంగా ఎప్పటికప్పుడు సమాచారం

మునిపల్లి(అందోల్): ఎంపీ ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో పరిస్థితిని గమనించేందుకు ప్రత్యేక ఎన్నికల అధికారులు పర్యటిస్తూ ఎప్పటికప్పుడు కలెక్టరేట్‌కు అనుసంధానంగా ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తోంది. మునిపల్లి మండల ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్‌తో పాటు జిల్లా ఎన్నికల ప్రత్యేకాధికారి కారుకు 360 డీగ్రీల సీసీ కెమెరా, వీడియోలను ఏర్పాటు చేసి ప్రతిరోజు పర్యటిస్తూ సమాచారాన్ని ఉన్నతాధికారులకు చేరవేస్తున్నారు. రాయికోడ్, మునిపల్లి, వట్‌పల్లి మండలాల్లోని ఆయా గ్రామాల్లో పర్యటిస్తూ గ్రామ



నిఘా కోసం కారు పైభాగాన ఏర్పాటు చేసిన సీసీ కెమెరా, వీడియో

పోలీస్, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశవర్కర్లతో సమాచారం సేకరిస్తున్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సాంకేతికతను ఉపయోగించుకుంటోంది. నగదు, మద్యం, అక్రమ రవాణా, పంపిణీని అరికట్టేందుకు 360 డీగ్రీల సీసీ కెమెరాలను కారుపై భాగాన ఏర్పాటు చేసి ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసింది.

ఎన్నికల విధుల్లో ఐదు శాఖల అధికారులు

పోలీసులు, తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయం, సహకార పరపతి సంఘం, ఇరిగేషన్ శాఖలు పని చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్స్‌లో పోలీస్ అధికారి, వీడియో గ్రాఫర్, ఎక్సైజ్, అటవీశాఖలకు సంబంధించిన అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. వీడియో సర్క్యులేషన్ టీమ్ సభ్యులు పూర్తిస్థాయిలో పరిశీలిస్తారు. మోడల్ కోడ్ అఫ్ కండక్ట్ బృందంలో గజిటెడ్ అధికారితో పాటు పోలీస్, వీడియో గ్రాఫర్ ఉంటారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన, అభ్యర్థుల ప్రచారం, ఖర్చులపై నిఘా ఏర్పాటు చేసినట్లు ఎన్నికల ప్రత్యేక అధికారులు పేర్కొన్నారు.

నిర్లక్ష్యానికి భారీ మూల్యం

గడ్డికి నిప్పు..

- ఈదురుగాలులకు చెలరేగిన మంటలు
- కాలిపోయిన 60 ట్రాక్టర్‌ల పశుగ్రాసం
- లబోదిబోమంటున్న 15 మంది రైతులు

ధారూరు: పక్క పొలం రైతు చేసిన అనాలోచిత చర్య కారణంగా 15 మంది రైతులకు సంబంధించిన 60 ట్రాక్టర్ల పశుగ్రాసం, ప్లాస్టిక్ పైపులు, స్టార్టర్లు కాలి బూడిదయ్యాయి. పొలంలో ఉన్న గడ్డిని దగ్ధం చేసేందుకు అగ్గిపుల్ల వేయగా అది రాజుకొని భారీ నష్టానికి కారణమైంది. ఈ సంఘటన ధారూరు మండలంలోని గట్టెపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. బాధిత రైతులు, గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కాలే శ్రావణ్‌కుమార్, చాకలి జగన్, సి.శేఖర్, మరాఠి పండరీరావు, అశోక్‌రావు, దేస్‌ముఖ్ మారుతిరావు, కుమ్మరి లక్ష్మయ్య, ఏర్పుల బాలయ్య, ఎం.హైబత్‌రావు, జి.బాలాజీరావు, కర్రె శామయ్య, కె.రాములు, టి.అనంతయ్య, డి.శ్రీనివాస్, చాకలి పాండులనే రైతులు వరి కోతల అనంతరం వరిగడ్డిని విక్రయించకుండా పొలాల్లోనే పశువుల గ్రాసం నిల్వ చేశారు. గడ్డితో పాటు ఆయా పొలాల్లో కరెంట్ మోటార్లు, స్టార్టర్లు వేసిన ప్లాస్టిక్ పైపులు ఉన్నారు. రాంపూర్‌తండాకు చెందిన రైతు దేవేందర్‌కు వీరి పొలాల పక్కనే వ్యవసాయ పొలం ఉంది. ఆదివారం దేవేందర్ తన పొలంలో ఉన్న పనికిరాని గడ్డిని తగలబెట్టేందుకు ప్రయత్నిస్తుండగా అక్కడే ఉన్న రైతులంతా వ్యతిరేకించారు. రైతులు వారిస్తున్నా వారి మాటలు లెక్కచేయకుండా పొలంలో అగ్గి వేలిగించాడు. అదే సమయంలో ఈదురు గాలులు చెలరేగడంతో పక్కనున్న వరిగడ్డి కుప్పలు, పొలాల్లో ఉన్న గడ్డికి మంటలు వ్యాపించి బూడిదగా మారింది. ఈ ఘటనలో పక్క రైతులు ఎక్కువ మొత్తంలో నష్టపోయారు. వీస్తున్న బలమైన గాలులకు మంటలను ఆర్పలేక అక్కడే ఉన్న రైతులు లబోదిబోమంటూ ఆందోళనకు గురయ్యారు.

పశువులకు తృటిలో ప్రాణపాయం

పొలాల గట్లపై ఉన్న చెట్ల నీడల్లో కట్టేసిన పశువుల చెంతకు మంటలు వ్యాపించిన వాటి దగ్గరకు రాకపోవడంతో అవి ప్రాణాపాయం నుంచి బయటపడ్డాయి. కొంతమంది రైతులు పరుగున వచ్చిన కట్టేసిన పశువులను విప్పి దూరం పంపించారు.

వంట చేస్తుండగా వృద్ధురాలి మెడలోని గొలుసు చోరీ





అనుమానితునిగా భావిస్తున్న వ్యక్తి

పంజగుట్ట: గుర్తుతెలియని వ్యక్తి ఓ ఇంట్లో చొరబడి వంట చేసుకుంటున్న వృద్ధురాలి మెడలోని బంగారుగొలుసు చోరీ చేశాడు. పంజగుట్ట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శ్రీనగర్ కాలనీలోని, శాలివాహన నగర్‌లో నివాసం ఉండే విజయలక్ష్మి(75) ఆదివారం ఉదయం వంట చేసుకుంటోంది. ఆ సమయంలో ఇంట్లో ఆమె ఒంటరిగా ఉంది. ఇంటి వెనక నుంచి గోడదూకి వచ్చిన అగంతకుడు మెల్లిగా వెనక నుంచి ఆమె మెడలోని నాలుగు తులాల బంగారు గొలుసు లాక్కుని పరారయ్యాడు. అనంతరం కుటుంబసభ్యులతో కలిసి ఆమె పంజగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేసింది. పంజగుట్ట ఏసీపీ మోహన్ కుమార్, ఇన్‌స్పెక్టర్ శోభన్, క్రైమ్ ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్‌లు సంఘటనాస్థలాన్ని పరిశీలించి బాధితులతో మాట్లాడి ఘటన వివరాలు తెలుసుకున్నారు. సమీపంలోని సీసీ కెమెరాల పుటేజీలను పోలీసులు పరిశీలించి అనుమానితునిగా భావిస్తున్న ఒక వ్యక్తిని గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రారంభించారు... వదిలేశారు

- ఆరోగ్య ఉపకేంద్రంలో కనీస సదుపాయాల లేమి
- అధికారుల మధ్య సమన్వయ లోపమే కారణం

ఆరోగ్య కేంద్రాన్ని ఆర్భాటంగా ప్రారంభించారు. కానీ ఇందులో మౌలిక సౌకర్యాలను కల్పించలేదు. దీంతో సిబ్బంది అరకొర సదుపాయాల మధ్యే యథావిధిగా మహిళ సంఘం భవనంలోనే విధులను నిర్వహిస్తున్నారు. కాగా, అధికారుల మధ్య సమన్వయ లోపం కూడా కారణమని తెలుస్తోంది. అక్కన్నపేటలో పరిస్థితి ఇదీ..

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం గండిపల్లిలో ప్రభుత్వ ఆరోగ్య ఉప కేంద్రాన్ని రూ.22 లక్షలతో నిర్మించారు. అయితే జనవరి 1న మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఇందులో ఫర్నిచర్లు, కుర్చీలు, కరెంట్, తాగు నీటి సౌకర్యాలు కల్పించ లేదు. ఇలా నాలుగు నెలలు గడుస్తున్నా.. వినియోగంలోకి తీసుకు రాకపోవడం పట్ల గ్రామస్తులు, గిరిజన తండాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆరోగ్య ఉపకేంద్రం పరిధిలో మారుమూల గిరిజనతండాలు అధికంగా ఉన్నాయి. ఈ విషయంపై పంచాయతీ రాజ్ ఏఈ స్నేహను 'సాక్షి' సంప్రదించగా భవన నిర్మాణ పనులు పూర్తి చేసి మంత్రి పొన్నం చేతులమీదుగా ప్రారంభించి గ్రామపంచాయతీకి అప్పగించామన్నారు. కార్యదర్శి సంపత్‌ను సంప్రదించగా ఉప కేంద్రం అప్పగించినట్లు మాకు ఎలాంటి సర్టిఫికెట్ ఇవ్వలేదన్నారు.



గండిపల్లిలో ఆరోగ్య ఉప కేంద్రం

వైద్య సిబ్బందికి ఇబ్బంది

ప్రస్తుతం మహిళ సంఘం భవనంలోని ఓ గదిలో ఆరోగ్య వైద్య సిబ్బంది అర కొర మౌలిక సదుపాయాల మధ్య విధులు నిర్వహిస్తున్నారు. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రం భవనంలోకి ఎప్పుడు వెళ్దామా? అని ఎదురు చూస్తున్నామని వైద్య సిబ్బంది తెలిపారు. ఏదిఏమైనా పంచాయతీరాజ్, జీపీల మధ్య సమన్వయం చేసి త్వరగా సౌకర్యాలు ఏర్పాటు చేసి ఉప కేంద్రాన్ని వినియోగంలోకి వచ్చేలా మంత్రి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అన్నదాత ఆగమాగం

- వెంటాడుతున్న అకాల వర్షాలు
- కొనుగోలు కేంద్రాల్లో తడుస్తున్న ధాన్యం
- టార్పాలిన్లు లేక అవస్థలు

వట్‌పల్లి(అందోల్): ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకుందామనుకున్న సమయంలో అకాల వర్షాలు రైతుల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయి. జిల్లాలో మొత్తం 211 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. కానీ, నిర్వాహకులు తాలు పేరుతో రైతుల నుంచి ప్రతి క్వింటాకు దాదాపు 7 కిలోల వరకు తరుగు పెడుతున్నారు. ప్రతీ ఏటా ధాన్యం కొనుగోలులో కోతల ఉంటున్నాయని రైతులు చెబుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలోని కొనుగోలు కేంద్రాల ద్వారా సుమారు 1.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటివరకు 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఈ ధాన్యం నుంచి 36 వేల మెట్రిక్ టన్నులు తరలించగా 4 వేల మెట్రిక్ టన్నులు ఇంకా కేంద్రాల్లోనే ఉంది. రెండు మూడు రోజుల నుంచి వాతావరణ పరిస్థితులు మారడంతో పాటు అకాల వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసి ముద్దవుతోంది. సరైన వసతులు లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలో కొన్ని కేంద్రాల్లో టార్పాలిన్లను పంపిణీ చేయకపోవడంతో వానలకు ధాన్యం తడిసిపోతోంది. దీంతో ధాన్యాన్ని కాపాడుకోవటానికి రైతులు నానా తంటాలు పడుతున్నారు. అధికారులు మాత్రం ఎన్నికల కారణంగా ధాన్యం కొనుగోళ్లపై దృష్టి సారించడం లేదనే విమర్శలున్నాయి. దీంతో కేంద్రాల నిర్వాహకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. అడ్డగోలు కోత విధిస్తూ రైతులను నట్టేట ముంచుతున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయి.





కన్‌సాన్‌పల్లి కొనుగోలు కేంద్రంలో అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని ఒకచోటుకి చేర్చుతున్న రైతులు, (ఇన్‌సెట్) టార్పాలిన్లు లేక వర్షానికి తడిసిన ధాన్యం

కనిపించని టార్పాలిన్లు..

కొనుగోలు కేంద్రానికి రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని వర్షం నుంచి రక్షించుకోవడానికి అన్ని ఏర్పాట్లు చేశామని అధికారులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. ధాన్యం రాశులపై కప్పడానికి ఇప్పటి వరకు కవర్లను అందించలేదని రైతులు చెబుతున్నారు. దీంతో జిల్లాలో కురుస్తున్న అకాల వర్షాలతో కొన్నిచోట్ల ధాన్యం తడిసింది. టార్పాలిన్లు ఇవ్వకపోవడంతోనే ధాన్యాన్ని రక్షించుకోలేకపోతున్నామని వాపోతున్నారు. చేసేదేమి లేక ఒక్కో టార్పాలిన్‌కు రోజుకు రూ.20 చెల్లించి కిరాయికి తెచ్చుకుంటున్నట్లు చెబుతున్నారు.

తాలు పేరిట కోతలు..

కొనుగోలు కేంద్రాల్లో తరుగు పేరిట నిర్వాహకులు రైతులను దోచుకుంటున్నారు. ఈ విషయంలో ప్రశ్నిస్తే కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. ధాన్యం కొనుగోలు చేయకుండా ఆలస్యం చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాలలో సౌకర్యాలు కల్పించడంతోపాటు త్వరిత గతిన కొనుగోళ్లు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ధాన్యం తరలింపునకు చర్యలు

కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని వెంటనే తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే లారీల యాజమాన్యంతో మాట్లాడాం. ఒకటి రెండు రోజుల్లో కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయిన ధాన్యాన్ని తరలిస్తాం. కొనుగోళ్లు కూడా వేగవంతం చేస్తాం. తాలు పేరిట ధాన్యంలో కోతలు విధిస్తే చర్యలు తీసుకుంటాం. రైతులకు టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని మార్కెటింగ్ శాఖ వారికి తెలియజేశాం.

– వనజాత, జిల్లా పౌరసరఫరాల అధికారి

కంకర పరిచారు.. వదిలేశారు



అసంపూర్తిగా జిల్లా సరిహద్దు రోడ్డు

- అసంపూర్తిగా సరిహద్దు రహదారి
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

కల్హేర్(నారాయణఖేడ్): బీటీ రెన్యూవల్ పనుల కోసం ఉన్న రోడ్డును తవ్వేశారు. ఆ తర్వాత కంకర వేసి రహదారి పనులను అసంపూర్తిగా వదిలేశారు. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. సంగారెడ్డి–కామారెడ్డి జిల్లా సరిహద్దులోని కల్హేర్, పిట్లం మండల కేంద్రల మధ్యలో సరైన రహదారి లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కల్హేర్ మండల కేంద్రంతో పాటు ఖానాపూర్(కె), ఇందిరానగర్, నాగధర్, మాసాన్‌పల్లి, మార్డి తదితర గ్రామాల ప్రజలు నిజామాబాద్, బోధన్, బాన్స్‌వాడ, బిచ్కుంద, పిట్లం, మహరాష్ట్రలోని దెగ్లూర్, తదితర ప్రాంతాలకు వివిధ పనుల నిమిత్తం వెళ్తుంటారు. కల్హేర్, పిట్లం మార్గంలో ప్రయాణిస్తే చుట్టూ దూరపు భారం తగ్గుతుంది. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రాజీవ్ పల్లెబాట కింద రెండు జిల్లాల సరిహద్దులో ఉన్న నల్లవాగు(మహరాజు వాగు)పై వంతెన నిర్మాణం పనులు చేపట్టేందుకు అప్పట్లో నిధులు కేటాయించగా వంతెన, బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టారు.

గుంతలమయంగా పిట్లం రోడ్డు

నల్లవాగు వంతెన ప్రదేశం నుంచి కామారెడ్డి జిల్లా పరిధిలో పిట్లం వరకు మట్టి రోడ్డు అధ్వానంగా ఉంది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కల్హేర్, పిట్లం మండలాలు రెండు జిల్లాల పరిధిలో ఉండడంతో రోడ్డు సమస్యను ఎవరూ పట్టించుకోవడంలేదని మండల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నల్లవాగుపై నిర్మించిన వంతెన పూర్తిగా దెబ్బతినడంతో వంతెన మధ్యలో ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తూ ప్రమాదకరంగా మారాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి గుంతలమయంగా మారిన రోడ్లకు మరమ్మతులు చేపట్టి సమస్యలను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఎవరూ పట్టించుకోవడం లేదు



కల్హేర్, పిట్లం మండల కేంద్రాల మధ్యలో ఉన్న రోడ్డు పూర్తిగా కంకర తేలి గుంతలమయంగా మారింది. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని అధికారులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి రోడ్డు బాగు పడితే ప్రజలకు ఉపయోగంగా ఉంటుంది. ప్రమదవశత్తు వాహనదారులు కంకరపై అదుపుతప్పి పడిపోతున్నారు.

– నర్మల బాల్‌రాజు, కల్హేర్

పశువుల ఎరువు.. పంటకు బలం

- పెరిగిన డిమాండ్.. ధరకు రెక్కలు
- కొనుగోలుకు వెనకడుగు వేయని రైతులు

జహీరాబాద్ టౌన్: పశువుల పేడ ఎరువుకు డిమాండ్ పెరిగింది. ఈ ఎరువు వాడకం వల్ల భూసారం పెరిగి పంటకు బలం వస్తుంది. పశువుల ఎరువును కొనుగోలు చేసి పంట పొలాల్లో చల్లి వానాకాలం సీజన్ సాగుకు సిద్ధమవుతున్నారు. సీజన్ ప్రారంభానికి సమయం దగ్గర పడుతుండడంతో రైతులు దుక్కులు చేస్తున్నారు. చేనుకు చేవ... పంటకు బలం వస్తుందని రైతులు పశువుల ఎరువు కొనుగోలు ప్రారంభించారు. ఈ ఎరువుకు డిమాండ్ పెరగడంతో ధరకు కూడా రెక్కలు వచ్చాయి.

జహీరాబాద్ వ్యవసాయ డివిజన్ పరిధిలోని రైతులు వానాకాలం సీజన్‌లో పత్తి, కంది, జొన్న, పెసర, వాణిజ్య పంటలైన అల్లం, పసుపు, చెరకు అధిక విస్తీర్ణంలో సాగు చేస్తుంటారు. రైతులు రసాయన ఎరువులతో పాటు పశువుల పేడ ఎరువును కూడా పంటలకు వాడుతుంటారు. పశువుల ఎరువు వల్ల భూసారం పెరిగి పంటల దిగుబడి ఆశాజనకంగా ఉంటుందని రైతుల నమ్మకం. పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ల పేడను వినియోగిస్తే



మొగుడంపల్లి గ్రామంలో ట్రాక్టర్ ద్వారా పొలాలకు తరలిస్తున్న పశువుల ఎరువు

పంటల దిగుబడి, నాణ్యత బాగుంటుందని నిపుణులు కూడా చెబుతున్నారు. ప్రతీ సంవత్సరం పవుశుల ఎరువు ధరలు గణనీయంగా పెరుగుతున్నాయి. గతేడాది కంటే ఈ సారి ధర ఎక్కువైంది. కిందటి సంవత్సరం గేదెల పేడ ఎరువు లారీ లోడ్ రూ.15 వేలు ఉండగా ఈ సంవత్సరం రూ.18వేలకు పెరిగిందని రైతులు పేర్కొన్నారు. మేకలు, గొర్రెల ఎరువు లారీ లోడ్‌కు రూ. 30 నుంచి రూ. 35 వేలు పలుకుతుంది.

పంటలకు గిట్టుబాటు ధర లభించడంతో...

అల్లం, పసుపు ఇతర పంటలకు ప్రస్తుతం ధరలు ఆశాజనకంగా ఉండడంతో పంటల సాగుకు రైతులు ప్రణాళికలు చేసుకుంటున్నారు. ఈ పంటలకు పశువుల ఎరువును వాడుతుంటారు. అందుకని ఎరువులకు డిమాండ్ పెరిగింది. పల్లెల్లో పశుపోషణ కూడా తగ్గడంతో ఎరువుల ఉత్పత్తి కూడా తగ్గి ధర పెరిగిందని రైతులు అంటున్నారు. పశువుల ఎరువు అల్లం, పసుపు వాణిజ్య పంటలకు వేయడం వల్ల పంటదిగుబడి గణనీయంగా పెరుగుతుంది. అధిక ధర పలుకుతున్నా రైతులు పశువుల ఎరువు కొనుగోలు చేయడానికి వెనకడుగు వేయడం లేదు.

డిమాండ్ పెరిగింది



పశువుల ఎరువుకు డిమాండ్ ఉండడంతో ధర కొంత వరకు పెరిగింది. అల్లం, పసుపు, ఆలు ఇతర పంటలకు పశువుల ఎరువు వేస్తే బలం ఉంటుంది. అల్లం, పసుపు గిట్టుబాటు ధర లభించడంతో వచ్చే ఏడాది పంట సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. పేడ ఎరువు ధర పెరిగినా రైతులు కొంటున్నారు. రసాయన ఎరువుల కన్న పశువుల ఎరువు వల్ల భూసారం పెరిగి పంట దిగుబడి ఎక్కువగా వస్తుంది.

–మామిడ్గి మల్‌శెట్టి, రైతు, ఇప్పెపల్లి

ఘనంగా రామానుజ జయంతి



అలంకరణలో రామానుజ విగ్రహం

కొడంగల్: పట్టణంలోని మహాలక్ష్మి వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం రామానుజ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశేష పూజలు చేశారు. అర్చకులు ఆలయ ప్రదక్షిణ చేసి పట్టు వస్త్రాలు, పూలమాలలు రామానుజ జీయర్‌స్వామి మూలమూర్తికి సమర్పించి, విశేష పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.